# చిత్తు కాగితాలు

అప్పల్రాజు, బంగార్రాజు వొకే వూళ్లో పుట్టి పెరిగేరు. ఇద్దరూ ఆ వూరి బడిలో అయిదోక్లాసు వరకూ కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత యిద్దరూ నర్సీపట్నం హైస్కూల్లో చేరారు. స్కూలుకి దగ్గరగా వున్న వో యింట్లో వీధి అరుగుమీద చిన్న గది అద్దెకు తీసుకున్నారు. అక్కడికి దగ్గర్లోని 'రాజుల బ్రాహ్మణ భోజనశాల'లో భోజనానికి ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరూ చెరోసగం పెట్టి పాత సైకిలు కొన్నారు. ఇద్దరూ కలిసి వారానికోసారి సొంతవూరు వెళుతూ వుండేవాళ్లు.

అప్పల్రాజు తండ్రికి మూడెకరాల మెట్టభూమి వుంది. వేరుశనగా, నువ్వులూ పండిస్తూ వుంటాడు. అతడికి నూనె ఆడే గానుగ కూడా వుంది. వేరుశనగ - నువ్వులూ కలిపి ఆడి నూనె - తెలగపిండి అమ్ముతూ వుంటాడు. అంతేకాకుండా కుంచానికి బేడ చొప్పున పుచ్చుకుంటూ ఆ వూరి వాళ్ళకీ పై ఊరు వాళ్ళకి కూడా నూనె ఆడి యిస్తూ వుంటాడు. వూరికి వెళ్ళినప్పుడల్లా అప్పల్రాజు సీసాతో నూనె పట్టుకు వస్తాడు. ఇద్దరూ ఆ నూనె భోజనంలోనే కాకుండా తలకు కూడా వాడుతారు..

బంగార్రాజు తండ్రి సొంత వూళ్లోనే వున్న బడిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతడికి కూడా రెండెకరాల మెట్టభూమి వుంది. అతడు కూడా వేరుశనగ నువ్వులూ పండిస్తాడు. ఆ రెండూ కలిపి నూనె ఆడిస్తాడు. అయితే - అదంతా యింట్లోనే ఖర్చయిపోతూ వుంటుంది. రోజూ కూరగాయలు కొనుక్కునే స్తోమత లేక సంవత్సరానికి సరిపడా ఆవకాయ పెడుతూ వుంటారు. వూళ్లో ఎవరికి వొంట్లో బాగా లేకపోయినా - 'నాలిక సచ్చిపోయింది. ఆవకాయ బద్దపెట్టరా!' అని అడుగుతూ వుంటారు. అంచేత - ఆవకాయ చాలా ఎక్కువగా పెడుతూ వుంటారు. బంగార్రాజు వూరికి వెళ్ళినప్పుడల్లా సీసాతో ఆవకాయ పట్టుకు వస్తాడు. ఇద్దరూ వాడుకుంటూ వుంటారు. అప్పల్రాజు లేత తెలకపిండి తెస్తూ వుంటాడు. బంగార్రాజు బెల్లంకొంటూ వుంటాడు. ఆ రెండూ కలిపి సాయంకాలం అల్పాహారంగా సేవిస్తూ వుంటారు. ఆ విధంగా యిద్దరూ కలిసి చాలా స్నేహంగా చదువు సాగిస్తున్నారు. ఇద్దరూ ఎనిమిదోక్లాసు పాసై తొమ్మిదిలో చేరారు. ఆ కాలంలో ఆ వూళ్లో అగ్నిప్రమాదం జరిగి వూరంటుకు పోయింది. గానుగెద్దును మంటల్లోంచి విడిపించడానికి అప్పల్రాజు తండ్రి తెగించి మంటల్లోకి దూకాడు. ఆ మంటల్లో ఎద్దుతోపాటు - అతడు కూడా మరణించాడు. ఆ

కుటుంబం దిక్కులేనిదైపోయింది. బంగార్రాజు తండ్రీ మరి కొందరూ కొంతకాలం కొద్దిగా ఆదుకున్నా, వాళ్లు కూడా యిబ్బందుల్లో వున్నవాళ్లే. అప్పల్రాజు చదువు మానేశాడు. 'నువ్వు తోడులేకుండా బడికి వెళ్లలేకపోతున్నాను! నేనూ బడి మానేస్తాను!' అని బంగార్రాజు కంట తడిపెడ్తూ చెప్పాడు. 'ఒద్దు! అలా చేయొద్దు! నాకోసం నువు చదువు మానేస్తే నాకెంతో బాధగా వుంటుంది! నువ్వైనా పెద్ద చదువు చదివి పెద్ద ఉద్యోగం చేయాలి! నువ్వు చదువు మానేస్తే నా మీద ఒట్టే!' అని అప్పల్రాజు చెప్పాడు. కొంతకాలం బడి మానేసినా ఆ తర్వాత బంగార్రాజు చదువు సాగిస్తున్నాడు.

★ ★ ★

విశాఖపట్నం నుంచి అప్పల్రాజు మేనమామ వచ్చాడు. అతడు విశాఖలో స్థిరపడిపోయాడు. మాధవధార కొండకు దిగువగా సొంతదైన పాకయిల్లు వుంది. ఎడ్లబండి వుంది. ఇసుక - రాయి - మట్టి లాంటివి బండిమీద తోలుతూ జీవితాన్ని గడుపుతున్నాడు. బాగా కష్టపడి పనిచేస్తూ జీవితంలో నిలదొక్కుకున్నాడు. తన యింటికి దగ్గరగా చిన్న యింటి జాగా కూడా కొన్నాడు. అతడికి వొక్కడే కొడుకు. ఆ తర్వాత పిల్లలు పుట్టలేదు. అతడు అక్కనీ పిల్లల్నీ విశాఖ తీసుకువెళ్ళిపోవడానికి వచ్చాడు.

'ఓలప్పా! వొక్కిత్తివే యిక్కడెలాగుండగలవు! ఏలుండాల? నిన్నూ పిల్లల్నీ తీసుకెల్లిపోవడానికి బైలెల్లి వొచ్చాను. ఇక్కడేముంది మనకి బావపోనాక? ఆ గరువుముక్క ఏదో అమ్మేసుగుని పోదాం. ఇక్కడుంటే కుర్రోడికి ఏపని దొరుకుతాది? మా యింటికి పొలిమేరలో నేబరు కంటురాట్టు మేస్త్రిరున్నాడు. మంచోడు. మంచి పేరున్నోడు. ఇప్పటికే రెండొందల యిళ్ళు కట్టించాడు. కుర్రోణ్ణి ఆ బాబుకాడ పడేస్తాను. కొంతకాలం కూలిపని సేత్తే, ఆ తర్వాత తాపీ పట్టిస్తాడు. తాపీ మేస్త్రిరి అయిపోతాడు. బతుకులో నిలదొక్కుకుంటాడు. బాగుపడతాడు. మనకే బెంగా వుండదు. నాను సిన్న యింటిజాగా కొనుంచినాను. గరువు ముక్క అమ్మిన డబ్బుతో మీకోసం అక్కిడ సిన్న యిల్లు నిలబెడతాను. నీ కూతురంటావా - అది నీ కూతురు కాదు ! నా కోడలే అనుకో! నాకూ వొక్కిడే గుంటడు కదా! ఇక్కిడ వొక్కిత్తివే వుంటే నాకు బెంగగా వుంటాది. వొణ్ణం ముద్ద గొంతుక దిగదు! ఓలప్పా! నా మాట కాదనకు. ఇక్కడి పనులు సక్కబెట్టుకుని వోరంలోపున ఎల్లిపోదాం' అని అతడు అన్ని విషయాలూ స్పష్టంగా చెప్పాడు. ఆమె వొప్పుకుంది. కొడుకు

బతుకూ కూతురి బతుకూ కూడా బాగుపడతాయని ఆలోచించి ఆమె సంతోషంగా వొప్పుకుంది.

ఆరోజున ఆ కుటుంబం వూరు విడిచి వెళ్లిపోతోంది. బంగార్రాజు - అప్పల్రాజూ - విడిపోతున్నందుకు, దూరమైపోతున్నందుకు విచారంలో మునిగిపోయారు. నోరువిప్పి మాట్లాడలేకపోతున్నారు. "నువు చదువు మానేశావు. నువు లేకుండా బడికి వెళ్లలేక వెళ్లలేక వెళుతున్నాను. ఆ బెంగ నుండి యింకా బయటపడే లేదు. ఇప్పుడు వూరే విడిచి వెళ్ళిపోతున్నావా!' అని బంగార్రాజు కన్నీళ్ళు కారుస్తున్నాడు. 'వూరు విడిచి పోవొద్దనీ అమ్మకీ మావయ్యకీ చెప్పాను. పట్టుపట్టాను. తగువుపెట్టాను, అల్లరి చేశాను. మరింక లాభం లేదు! వెళ్ళక తప్పదు!' అని కంటతడి పెట్టుకుంటూ మిత్రుణ్ణి సందిట్లో బంధించాడు. 'చూడు బంగారూ! నేనెలాగా చదువుకోలేకపోతున్నాను. నువ్వైనా పెద్ద చదువు చదివి పెద్ద వుద్యోగం చేయాలి. నువు బాగా చదువుకోకపోతే నా మీద ఒట్టే!' అని కూడా చెప్పాడు. కుటుంబం అందరూ సామాన్లతో ఎడ్లబండి ఎక్కారు. బండి కదిలింది. బంగార్రాజు కన్నీళ్లలోంచి అప్పల్రాజుని చూస్తూ నిలబడిపోయాడు. ఎడ్లబండి రోడ్డు వరకూ వెళుతుంది. అక్కణ్నుంచి బస్సులో వెళతారు. బంగార్రాజుకి మిత్రుణ్ని మళ్ళీ చూడాలని - మాటాడాలనీ - అనిపించింది. సైకిలు తీసుకుని రోడ్డు చేరుకున్నాడు. కొంతసేపు మిత్రుడితో గడిపాడు. బస్సు రాగానే అందరూ వెళ్లిపోయారు. బంగార్రాజు భారంగా యింటికి తిరిగి వచ్చాడు.

★ ★ ★

అప్పకు చెప్పినట్లుగానే అప్పల్రాజు మేనమామ అన్నీ చేశాడు. గరువు అమ్మిన డబ్బుతో తన జాగాలో చిన్న మట్టి యిల్లు కట్టించాడు. ఆ యిల్లు జాగాతో సహా అప్ప పేర రాశాడు. అతడి కొడుకు ఇసక సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నాడు. అతడికి అప్ప కూతురితో పెళ్ళిచేశాడు. అప్పల్రాజుని లేబరు కంట్రాక్టరు వద్ద కూలిపనికి పెట్టాడు. ఆ విధంగా ఆ కుటుంబాన్ని యిబ్బందుల నుండి బయటపడేసి ఆదుకున్నాడు. అప్పల్రాజు కష్టపడి పనిచేస్తున్నాడు. యజమాని మెప్పు పొందుతున్నాడు. కూలిపని చేస్తూ తాపీ పని కూడా నేర్చుకుంటున్నాడు. రెండేళ్ళు పోయాక తాపీ మేస్త్రీ పని యిచ్చి కూలి కూడ పెంచాడు. అప్పల్రాజు జీవితంలో స్థిరపడ్డాడు. డబ్బు అనవసరంగా ఖర్చు పెట్టకుండా కూడ బెడుతున్నాడు. ఇద్దరు మిత్రులూ నెలకోసారి ఉత్తరాలు రాసుకుంటున్నారు. 'నువ్వైనా పెద్ద చదువు

చదివి పెద్ద ఉద్యోగం చేయాలి' అని అప్పల్రాజు మిత్రుడికి ప్రతి ఉత్తరంలోనూ రాస్తున్నాడు. సంవత్సరానికి రెండు సార్లయినా కలుసుకుంటున్నారు.

★ ★ ★

బంగార్రాజు పదోక్లాసు ఫస్టుక్లాసులో పాసయ్యాడు. ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాడు. అయినా సంతోషంగా లేడు. అతడి తలిదండ్రులు కూడా విచారంగా వున్నారు. పి.యు.సి చదవాలంటే మరోచోట ఎక్కడో పెట్టి చదివించాలి. ఎక్కడోపెట్టి చదివించాలంటే తండ్రి జీతం పూర్తిగా యిచ్చేసినాచాలదు. మరి యిల్లెలా గడుస్తుంది? ఆ సమస్యతో తలలు బద్దలు కొట్టుకుంటున్నారు.

మిత్రుణ్ణి కలుసుకోడానికి అప్పల్రాజు ఆ వూరు వచ్చాడు. మంచి మార్కులు తెచ్చుకుని పాసైనందుకు మిత్రుణ్ణి అభినందించాడు. అయితే ఆ యింట్లో ఎవరూ కూడ సంతోషంగా లేరని గ్రహించాడు. ఎందుకు సంతోషంగా లేరో కూడ గ్రహించాడు. అప్పుడు అప్పల్రాజు మిత్రుడికి వొక సలహా చెప్పాడు.

'ఒరేయ్! బంగారూ! నువ్వు సదువు ఆపేవొద్దు. ఇశాపట్నంలో సదువు. నాకు యిల్లు వుంది. ఆ యింట్లో నాతో వుందువుగాని. మా యమ్మ ఎప్పుడూ తమ్ముడింట్లోనే వుంటోంది. మనిద్దరం కలిసి వంట చేసుకుందాం. అలగసేత్తే, నీ సదువుకిఎంతో ఖర్చు అవదు. నాకు అద్దె యివ్వక్కర్లేదు. పెద్ద సదువు సదివి పెద్ద ఉద్యోగం వచ్చాక యిద్దువుగానిలే! మరింకేవీ ఆలోసించకు! నాతోరా! ఎల్లుండే కలిసి ఎల్లిపోదాం! నా మాట కాదంటే నా మీద ఒట్టే!' అని అప్పల్రాజు పట్టు పట్టాడు. 'నా భారాన్ని నీ నెత్తిమీద మోపలేను! నా మనసు వొప్పుకోదు! స్వార్థంతో స్నేహాన్ని దుర్వినియోగం చేయలేను! నీ జీవితాన్ని పాడు చేయలేను!' అని బంగార్రాజు మనసులో మాట చెప్పాడు. అయితే - అప్పల్రాజు పలువిధాల నచ్చజెప్పి పట్టుపట్టి వొప్పించాడు. చెల్లెలి మెడలోని బంగారు గొలుసూ - తల్లి బంగారు గాజులూ - అమ్మి తండ్రి కొంత డబ్బు యిచ్చాడు. ఇద్దరూ విశాఖపట్నం చేరుకున్నారు. బంగార్రాజు పి.యు.సి.లో చేరాడు. ఆ రోజున అప్పల్రాజు సంతోషానికి అడ్డులేకపోయింది.

★ ★ ★

బంగార్రాజు - అప్పల్రాజు కలిసి వుంటున్నారు. కలిసి వంటచేసుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా - ఏ పని చేసినా - యిద్దరూ కలిసే

వెళుతున్నారు. కలిసే చేస్తున్నారు. సెలవురోజుల్లో వీలైనప్పుడల్లా బంగార్రాజు, అప్పల్రాజు పనిచేస్తున్న అపార్టుమెంట్సు దగ్గరికి వెళుతున్నాడు. తాపీ పని నేర్చుకుంటున్నాడు. 'పెద్ద సదువు సదువుతున్నావ్! సదువుతావ్! పెద్ద ఉద్యోగం సేత్తావ్! ఇదేం పని రానీకు! నాలోటోళ్లకి తప్పదుగానీ నీకేటిరా యీ ఖర్మ!' అని అప్పల్రాజు అంటూ వుంటాడు. 'ఇంట్లో వొక్కణ్నీ కూర్చుని ఎంతసేపు చదవగలను? ఏ పనినీ తక్కువగా చూడకూడదు. దేని విలువ దానికుంటుంది' అని బంగార్రాజు అంటూ వుంటాడు. 'నువు బేగి పని పట్టేశావు! నాకంటే నువ్వే బాగా నిదానంగా కడుతున్నావు!' అని కూడ అప్పల్రాజు అంటున్నాడు.

★ ★ ★

బంగార్రాజు పి.యు.సి. ఫస్టుక్లాసులో ఎక్కువ మార్కులు తెచ్చుకుని పాసయ్యాడు. అప్పల్రాజు పట్టుదల వల్ల బియస్సీలో చేరాడు. అప్పల్రాజుని పెళ్లి చేసుకోమని తల్లీ మావయ్యా ఒత్తిడి చేస్తున్నారు. అప్పల్రాజు కాదంటున్నాడు. 'నన్ను పెళ్లిచేసుకోమని అస్తమానం అదే గోల! నా బుర్ర తినేస్తున్నారు! ఇంక ఆ వూసెత్తుతే యిల్లు ఒగ్గేసి ఎక్కడికో పోతాను!' అని బెదిరించాడు. అలా చెప్పి వొత్తిడి నుంచి తప్పించుకుంటున్నాడు.

ఒకరోజు బంగార్రాజు ఆ విషయం కదిపేడు.

'ఏరా! పెళ్లి చేసుకోనంటున్నావట?'

'నా యిష్టం!'

'కారణం?'

'నా యిష్టం! అదే కారణం!'

'కాదు. అబద్ధం చెబుతున్నావు. నాకోసం మానేస్తున్నావు. నా చదువుకి అడ్డు తగులుతుందని మానేస్తున్నావు. నాకోసం నీ బతుకు పాడుచేసుకుంటున్నావు. అలా చేయడం మంచిది కాదు. నేనెక్కడో వుండి చదువు పూర్తి చేస్తాను. పెళ్లి చేసుకుని సుఖంగా జీవితాన్ని గడుపు. నా మనసు చాలా బాధపడుతోంది. అది కూడా అర్థం చేసుకోడానికి ప్రయత్నించు!'

'ఇప్పుడింకా పెళ్లిచేసుకోను. ఎవరి మాటా వినను. నువ్వు చదువు పూర్తి చేసుకో. పెద్ద ఉద్యోగం సంపాదించు. సంపాదన మొదలెట్టు! అంతవరకూ

నువ్వు యిక్కడే వుండక తప్పదు. కాదంటే నేనొప్పుకోను. నా మీద ఒట్టే!' అని అప్పలరాజు తన నిర్ణయం చెప్పాడు.

★ ★ ★

బంగార్రాజు బియస్సీ ఎక్కువ మార్కులు తెచ్చుకుని ఫస్టుక్లాసులో పాసయ్యాడు. అప్పలరాజు ఒత్తిడి చేయడంవల్ల ఎమ్మెస్సీలో చేరాడు. ఎమ్మెస్సీ కూడా ఎక్కువ మార్కులు తెచ్చుకుని ఫస్టుక్లాసులో పాసయ్యాడు. తనమిత్రుడు పెద్ద చదువు చదివి పూర్తి చేసినందుకు అప్పలరాజు చాలా సంతోషించాడు. అతని ఆనందానికి అంతులేదు. 'నీకు ఎంత బేగి పెద్ద ఉద్యోగం వస్తే అంత బేగి నేను పెళ్లి చేసుకుంటాను! అంతవరకూ నాతో వుండు. కాదంటే ఒప్పుకోను. నామీద ఒట్టే!' అని అప్పలరాజు పట్టుపట్టాడు. విశాఖలో వుండే ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవాలి కాబట్టి బంగార్రాజు బాధపడుతూనే మిత్రుడితో వుంటున్నాడు. ఉద్యోగం వచ్చాక తీర్చలేని తన మిత్రుడి రుణాన్ని ఏదో విధంగా ఎంతో కొంత తీర్చుకోవాలని ఆలోచిస్తున్నాడు.

★ ★ ★

బంగార్రాజు ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. పత్రికలన్నీ చూస్తున్నాడు. ఉద్యోగాలకి అప్లికేషన్లు పంపిస్తున్నాడు. ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలు రాస్తున్నాడు. ఇంటర్వ్యూలకి వెళుతున్నాడు. కొందరి యిళ్లకు వెళ్లి వారి పిల్లలకు చదువు చెబుతున్నాడు. ఆ డబ్బు ఉద్యోగ ప్రయత్నాల్లో ఖర్చు పెడుతున్నాడు.

తండ్రి రిటైరైపోయాడు. రెండెకరాల భూమీ కొడుకు చదువుకోసం అమ్మేశాడు. తలదాచుకోవడానికి చిన్నమట్టి కొంప తప్ప మరేమీ లేదు. అతడు బెంగతో మంచానపడ్డాడు. 'నాన్నా! నాకు ఉద్యోగం దొరికిందని వాడు చెప్పేవరకూ నా ప్రాణాలు పోవు! ఆ మాట విన్నాక ప్రశాంతంగా ప్రాణాలు విడిచిపెట్టేస్తా!' అని అతడు పదే పదే అంటున్నాడు. సంవత్సరం గడిచిపోయింది. రెండో సంవత్సరం గడుస్తోంది. ప్రైవేటు కాలేజిలో లెక్చరరు ఉద్యోగం దొరికింది. నెలకి తొమ్మిది వందలు చేతికొస్తుంది.

'ఒరేయ్! అప్పిగా! నువ్వింక పెళ్లిచేసుకోరా!'

'ఉద్యోగం దొరికిందా?'

'దొరికింది!'

'జీతమెంత?'

'నెలకి తొమ్మిది వందలు!'

'అది ఉద్యోగం కాదు! నీకు పెద్ద ఉద్యోగం దొరికేవరకూ పెళ్లిచేసుకోను. నువు నాతో వుండక తప్పదు. నువ్వేమి చెప్పినా వినను. అయిదేళ్ల వయసులో బడిలో చేరావు. ఇరవై ఏళ్లు ఎంతో కష్టపడి చదివేవు. ఎన్నో యిబ్బందులు పడ్డావు. వున్నదంతా వూడ్చేసి ఖర్చుపెట్టి చదివేవు. నిద్ర - ఆహారం - మానేసుకుని చదివేవు. నీకు రోజుకి ముప్పై రూపాయలు కూలా! నా రోజు కూలి డెబ్బై ఐదు! ఎమ్మెస్సీ సదివినోడికి రోజుకూలి ముప్పయ్యా!? నేను పదమూడో ఏడునుంచి సంపాదిస్తున్నాను. బాగా కూడబెట్టాను. బాగా నిలదొక్కుకున్నాను. ఇంతవరకూ నువ్వు ఖర్చే పెట్టేవుగానీ కాణీ సంపాదించలేదు! ఎమ్మెస్సీ సదివినోడికి రోజు కూలి ముప్పయ్యా!?' అని అప్పల్రాజు మండిపడిపోతున్నాడు.

★ ★ ★

బంగార్రాజు తొలి నెల జీతం తీసుకున్నాడు. అప్పల్రాజుకి కొత్త బట్టలు కొన్నాడు. రెండో నెల జీతం అందుకున్నాడు. తండ్రికీ, తల్లికీ, చెల్లెలికి కొత్త బట్టలు కొన్నాడు. ఇంటికి వెళ్లాడు.

'నాన్నా! నాకు ఉద్యోగం దొరికింది! కొత్త బట్టలు కొన్నాను! తీసుకోండి!'

'ఉద్యోగం దొరికిందా!! దొరికిందా!! దొరికిందా!!' అని ఆనందంతో కొడుకుని కౌగిట్లోకి తీసుకున్నాడు. అతడి కళ్లు ఆనందాశ్రువులు వర్షిస్తున్నాయి. బంగార్రాజు కళ్లు విషాదాశ్రువులు కురుస్తున్నాయి. తండ్రి ఆనందాన్ని తట్టుకోలేకపోతున్నాడు. ఆవేశంతో వూగిపోతున్నాడు. గుండెపోటు వచ్చేసింది. 'ఉద్యోగం దొరికిందా! దొరకిందా! దొరికిందా!' అని ఆనందంతో కేకలు వేస్తూ కుప్పలా కూలిపోయాడు. 'రోజుకి ముప్పైరూపాయల కూలి! అదీ నాకు దొరికిన ఉద్యోగం!' అని మనసులో కుమిలిపోతూ బంగార్రాజు తండ్రి శవం మీద పడి ఏడుస్తున్నాడు.

తల్లినీ, చెల్లెల్నీ తీసుకుని బంగార్రాజు విశాఖ వచ్చేశాడు. కాలేజి లెక్చరరనే బిరుదును తగిలించుకుని రోజుకి ముప్పై రూపాయల కూలి సంపాదిస్తున్నాడు. ఉద్యోగాలకి అప్లికేషన్లు పంపిస్తూనే వున్నాడు. ఉద్యోగం కోసం పరీక్షలు రాస్తూనే వున్నాడు. ఇంటర్వ్యూలకి వెళుతూనే వున్నాడు. రెండేళ్లలా గడిచిపోయాయి.

మంచి ఉద్యోగం రాలేదు. ఒకరోజు అప్పలరాజు అడగలేక అడగలేక బంగార్రాజుని వొక ప్రశ్న అడిగేడు.

'ఒరేయ్! బంగారూ! నీకు మంచి ఉద్యోగం ఎందుకు దొరకడం లేదు?'

బంగార్రాజు జవాబు చెప్పాడు.

'చదువు వ్యాపారంగా మారిపోయింది. చదువు మీద వున్న వ్యాపార ప్రభావం ఉద్యోగం మీద కూడా విస్తరించింది. ఆ రెండింటికీ కూడ ఎక్కువగా పెట్టుబడి కావాలి. ఇంజినీరింగూ - ఇంగ్లీషు వైద్యం - లాంటి చదువులకి ఉ ద్యోగవకాశాలు ఎక్కువగా వుంటాయి. వాటిలో సీటు దొరకడానికి ప్రవేశ పరీక్షలుంటాయి. అవి పోటీ పరీక్షలు. వాటిల్లో నెగ్గుకు రావడానికి చిన్నప్పట్నుంచి పెట్టుబడి పెడుతూ మంచి సంస్థలలో చదవగలగాలి. చదువుతోపాటు అదనంగా కోచింగ్ కోర్సులు కూడా తీసుకుని చదువుతూ వుండాలి. దానికంతటికీ ఎక్కువగా పెట్టుబడికావాలి. ఆ పోటీ పరీక్షల్లో పెట్టుబడి పెట్టగలిగిన వాళ్లతో పెట్టుబడి పెట్టలేని వాళ్లు నెగ్గుకు రావడం గొప్ప కష్టం! తక్కిన చదువులకి కూడా ఉద్యోగవకాశాలున్నాయి. వాటికి కూడా పోటీ పరీక్షలుంటాయి. మళ్లీ ఉద్యోగాలలో ఎంపికకు కూడా పోటీపరీక్షలు. మళ్లీ అదే సమస్య! పెట్టుబడి సమస్య! అంతేకాకుండా - లంచం యివ్వాలన్నా -రికమెండేషన్ సంపాదించాలన్నా - పెట్టుబడి కావాలి కదా! ఆవిధంగా అటు చదువు ఇటు ఉద్యోగం రెండూ కూడ పెట్టుబడి శక్తి మీద ఆధారపడి వున్నాయి! అదంతా పెద్ద వ్యాపారమైపోయింది. అంచేత పేద ప్రజలు కూలిపోతారు. ఉన్నవాళ్లు బాగుపడతారు. యువతరం దాన్ని గుర్తించకుండా, పాలకులూ, పెట్టుబడిదారీ వర్గం యువతను ప్రసారమాధ్యమాల ద్వారా కుటిల, రాజకీయాలూ, మతం, సెక్స్, హింస, నేరం, వాటి మత్తులో ముంచేస్తున్నారు! ఇలాంటి ద్రోహంలో నాకు మంచి ఉద్యోగం దొరకడంలేదు' అని ఉద్యోగం ఎందుకు దొరకడం లేదో వివరంగా చెప్పాడు.

★ ★ ★

'ఒరేయ్! బంగారూ! ఇయ్యాలనుంచి నా కూలీ రోజుకి వందా!' అని అప్పలరాజు సంతోషంగా చెప్పాడు.

'చాలా సంతోషం! చాలా సంతోషం! సమాజంలో వస్తున్న మార్పుని గుర్తించాను. నిజమైన శ్రమకి - ఉత్పత్తి చేసే చేతుల శ్రమకి డిమాండు

పెరుగుతోంది. గుర్తింపు వస్తోంది. నాలాంటి వాడి తెల్ల చొక్కా శ్రమ కంటే - నిజమైన శ్రమకి ఎక్కువ విలువ - ఎక్కువ కూలి దొరుకుతోంది. ఇది చాలా మంచి పరిణామం. అయితే - శ్రమ దోపిడీ మాత్రం ఎప్పటిలాగే కొనసాగుతూనే వుంది!' అని బంగార్రాజు చెప్పాడు.

ఇద్దరు మిత్రులూ చాలాసేపు చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

★ ★ ★

'ఓరేయ్! అప్పిగా! నీకో మంచివార్త! నాకు పెద్ద ఉద్యోగం దొరికింది!' అని ఓరోజున బంగార్రాజు అప్పల్రాజు నోటికి మిఠాయి అందించాడు. అప్పల్రాజు సంతోషంతో పొంగిపోతున్నాడు. మిత్రుణ్ణి కౌగిట్లో బంధించేడు. అది తన విజయంగా భావించి ఆనందంతో కుప్పిగంతులు వేస్తున్నాడు. బంగార్రాజు విరగబడి నవ్వుతున్నాడు.

'ఈ వూళ్లోనే దొరికిందా?'

'అవును! ఈ వూళ్లోనే!'

'ఏ ఆఫీసులో?'

'అపూర్వ అపార్టుమెంట్లు కడుతున్నారు కదా! అక్కడ తాపీ మేస్త్రీగా చేరాను! ఈరోజు ఉదయం నుంచి పనిచేస్తున్నాను! రోజుకి వంద రూపాయలు కూలి!' అని తాపీ చూపించాడు. అప్పల్రాజు తల తిరిగిపోయి నేలమీద పడిపోయాడు.

★ ★ ★

బాగా చదువుకున్న యువతను కూలీలుగా చేస్తున్న వ్యవస్థను యువత ద్వేషించకుండా ఉంటుందా? శత్రువు కాదా? తిరుగుబాటు ఉద్యమాలు ఉధృతమైతే, ఆ తప్పు ఎవరిది?

(సుప్రభాతం - వారపత్రిక - 12.04.1998) (హిందీ - భాషా - ద్వైమాసిక పత్రిక - మార్చి - ఏప్రిల్ 2004 - అనువాదం : డా॥ఎస్. పద్మావతి)